478) బౌళి

ప॥ నిరుహేతుకాన నన్ను నీవు రక్షించే వింతే। నిరతి నాకొరకే పో నిను సేవించేది॥

చ॥ ముందు సిరులిత్తువని మోక్షము నీ విత్తువని। బందుకట్టుదుదుఃఖముల బాపుదువని।
యిందలియాసలనేపో యేచిన నాభయభక్తి। యెందును నావల్ల నీకు నించుకంతా లేదు॥

చ॥ జననాలు చూచి చూచి సరి మరణాలు చూచి। వెనకటికథలు వినివిని।
నినుపై యీయాసనేపో నిన్ను సారె బొగడేది। వొనర నీయాసేపో వుపకారగురువు॥

చ॥ లోకులు గొలువగాను లోన నీవుండగాను। దీకొని గురుడు బోధించగాను।
కైకొని శ్రీవేంకటేశ కరుణించగా నీవు। దాకొని యీయాసకే నీదాసినై కొలిచితి॥